## క్లుప్తంగా

### ఏసీపీ రాజును కలిసిన కాంగ్రెస్ నాయకులు



ఏసీపీ రాజును సన్మానిస్తున్న యాటనర్సింహా, కాంగ్రెస్ నాయకులు

**కడ్తాల్:** ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజును బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఏసీపీ రాజుకు పూలమొక్క అందజేసి, శాలువా కప్పి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బీచ్యా నాయక్, జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ రాజవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

### ఆర్యవైశ్యుల సంక్షేమానికి నిధులు కేటాయించండి

రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్ పర్సన్‌కు వినతి



సుజాతను సన్మానిస్తున్న వెంకటేశ్‌గుప్తా

**కడ్తాల్:** కల్వకుర్తి నియోజకవర్గంలోని నిరుపేద ఆర్యవైశ్యుల సంక్షేమాభివృద్ధికి, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ నుంచి నిధులు కేటాయించాలని, ఆర్యవైశ్య సంఘం నాయకులు, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్‌గుప్తా పేర్కొన్నారు. శనివారం కల్వ సుజాతను, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్ గుప్తా ఆధ్వర్యంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి ఆమెను సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గంప వెంకటేశ్ గుప్తా మాట్లాడారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ ద్వారా నిరుపేద ఆర్యవైశ్యులను ఆదుకోవాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వారికి అందేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ ఉమ్మడి పాలమూర్ జిల్లా చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రామకృష్ణ, పీఏసీఎస్ చైర్మన్ రంగారెడ్డి, మాణిక్యరెడ్డి పాల్గొన్నారు.

### స్మార్ట్‌మనీపై అవగాహన

**ఇబ్రహీంపట్నం రూరల్:** స్మార్ట్‌మనిపై అవగాహన కలిగి ఉండాలని పిన్‌టాపిడియా రిసోర్స్ పర్సన్ నచికేత్ సావే పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం మండలంలోని పోచారం గ్రామంలో శనివారం పీవీ రాంరెడ్డి పీజీ కళాశాలలోబుల్ రైసర్స్2024 స్మార్ట్ మనీ అనే అంశంపై వర్క్‌షాపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన పిన్‌టాపిడియా రిసోర్స్ పర్సన్ నచికేత్ సావే మాట్లాడారు. మనిమేనేజ్‌మెంట్, పోర్‌పిడియో, పిన్‌టాపిడియా గూర్చి వివరించారు. ఆర్థిక అక్షరాస్యత, స్టాక్ మార్కెట్ పెట్టుబడుల గురించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీనివాస్‌రావు, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఓడీ మహేశ్, అధ్యాపకులు, హరిత, శృతి, శ్రీదేవి, రమేశ్, ఎంబీఏ మొదటి సంవత్సరం విద్యార్థులు హరిత, స్మృతి, శ్రీదేవి, రమేష్, ఎంబీఏ మొదటి సంవత్సరం విద్యార్థులు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు బ్యాగుల పంపిణీ



బ్యాగులు, పుస్తకాలు అందజేస్తున్న సమర్థనం దివ్యాంగుల సంస్థ ప్రతినిధులు

**యాచారం:** గడ్డమల్లయ్యగూడ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం బ్యాగులు పంపిణీ చేశారు. పీఆర్టీయూ పత్రిక సంపాదకుడు జగన్మోహన్‌గుప్తా కృషితో సమర్థనం దివ్యాంగుల సంస్థ వారు పాఠశాల విద్యార్థులకు బ్యాగులు, నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు అందజేయడం అభినందనీయమన్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను శ్రద్ధగా విని మంచి మార్కులు తెచ్చుకోవాలని జగన్మోహన్‌గుప్తా సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సంజీవ్‌నాయక్, ఉపాధ్యాయులు రోహిణి, లత, పావని, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా స్వపరిపాలన దినోత్సవం

**మాడ్గుల:** మాడ్గుల మండలంలో ఇర్విన్ గ్రామంలోని జిల్లా ఉన్నత పాఠశాలలో శనివారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు ఒకరోజు పాఠాలు బోధించారు. ప్రధానోపాధ్యాయుడిగా శ్రోహిత్, కలెక్టర్‌గా మేఘన, డీఈఓగా అయేషాబేగం, ఎంఈఓగా శరత్ పాఠశాలను సందర్శించారు. అనంతరం హెచ్‌ఎం పర్వతాలు విద్యార్థులను అభినందించారు. ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లపై ఆశలు!



తక్కళ్లపల్లిలో పిల్లర్లకు పరిమితమైన నిర్మాణ పనులు



మొండిగౌరెల్లిలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే నిర్వహిస్తున్న అధికారులు

- ప్రజాపాలనలో ఇళ్ల కోసం 13,768 మంది లబ్ధిదారుల దరఖాస్తు
- ఖాళీ స్థలం లేనివారికి స్థలంతో సహా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని వేడుకోలు
- బీఆర్‌ఎస్ పదేళ్ల కాలంలో మంజూరు ఊసేలేదు
- ఇబ్బందులు ఎదుర్కొన్న పేదలు

**యాచారం:** ఇందిరమ్మ ఇళ్లపైనే పేదలు ఆశలు పెట్టుకున్నారు. స్థలాలు లేనివారు కొందరు, ఇరుకైన గదుల్లో మరికొందరు కాలం వెళ్లదీస్తున్నారు. అర్హులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేస్తుందా? లేదా? అని ఆందోళనలో లబ్ధిదారులు ఉన్నారు. గత బీఆర్‌ఎస్ పదేళ్ల కాలంలో ఇళ్ల ఊసేలేదు. చాలా వరకూ పేదలకు మంజూరు చేయలేదు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలోనే ఇందిరమ్మ పథకం ద్వారా ప్రతి పేదవాడు పూరి గుడిసెలను తీసేసి స్లాబ్ ఇళ్లు నిర్మించుకున్నారు. యాచారం మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో 20 వేలకు పైగా స్లాబుల ఇళ్లన్నీ వైఎస్సార్ హయాంలో మంజూరైనవే. ఇందిరమ్మ పథకం కింద కొన్ని గ్రామాల్లో స్థలాలు లేని వారికి స్థలాలు ఇచ్చి, ఇళ్లు నిర్మించారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ సర్కార్ డబుల్ బెడ్‌రూం ఇళ్ల పేరుతో తక్కళ్లపల్లి గ్రామంలో నిర్మాణ పనులు ప్రారంభించి వదిలేశారు. కాని ఏ ఒక్క పేదవాడికి ఇళ్లు గానీ, ఇళ్ల స్థలం గానీ మంజూరు చేయలేదు. గ్రామాల్లో స్లాబ్ ఇళ్లు చూస్తే వైఎస్సారే గుర్తుకు వస్తారని పేదలు స్మరించుకోవడం గమనార్హం.

**ప్రజాపాలనలో 13,768 దరఖాస్తులు**

రేవంత్‌రెడ్డి సర్కార్ ఏర్పాటైన తర్వాత ప్రజాపాలన కార్యక్రమం చేపట్టి ఇళ్లు, ఇంటి స్థలాల కోసం దరఖాస్తులు తీసుకున్నారు. ప్రజాపాలన కార్యక్రమంలో యాచారం మండలంలోని 24 గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల కోసం గునుగల్-633, తమ్మలోనిగూడ-355, నందివనపర్తి-972, అయ్యవారిగూడ-217, కుర్మిద్ద-792, మంతన్‌గౌరెల్లి-782, నక్కర్తమేడిపల్లి-1054, చౌదర్‌పల్లి-543, గడ్డమల్లయ్యగూడ-350, నల్లవెల్లి-836, యాచారం-921, నానక్‌నగర్-326, చింతపట్ల-737, నస్దిక్‌సింగారం-364, మొండిగౌరెల్లి-493, తక్కళ్లపల్లితండా-226, మల్కీజ్‌గూడ-435, కేసీతండా-311, మాల్-944, చింతుల్ల-591, ధర్మన్నగూడం-208, కొత్తపల్లి-786, తక్కళ్లపల్లి-342, తాడిపర్తి-550 మంది పేదలు ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తులు చేసుకున్నారు.

### ఇళ్లు లేక కమ్యూనిటీ హాల్లోనే..



ఇళ్లు మంజూరు కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్నాం. అధికారులకు ఎన్నిసార్లు దరఖాస్తులు చేసుకున్నా ఫలితం లేకపోయింది. ఇళ్లు కట్టుకునే ఆర్థిక స్తోమత లేక పూరిగుడిసెలోనే ఉంటున్నాం. వర్షాలకు ఆ గుడెసే కూడా కురుస్తుండడంతో ప్రస్తుతం ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో జీవితం గడుతుపుతున్నా. ఈసారైన ఇళ్లు వస్తుందో? రాదోనని అనుమానంగా ఉంది.

– కంబాలపల్లి పోచయ్య, తక్కళ్లపల్లి

### లబ్ధిదారులకు స్థలాలు లేవు..



ఇందిరమ్మ ఇళ్ల కోసం 921 మంది దరఖాస్తులు చేసుకున్నారు. నాలుగు రోజులుగా ఇందిరమ్మ దరఖాస్తులపై సర్వే చేస్తున్నాం. దరఖాస్తుదారులు ఉంటున్న ఇళ్లు స్వంతమా? కాదా? గతంలో ఇళ్లు మంజూరైందా? లేదా? సర్వే చేస్తున్నాం. అధిక శాతం మంది దరఖాస్తుదారులకు స్థలాలు లేవు. ఇళ్లు మంజూరు చేస్తే ప్రస్తుతం ఉన్న రేకుల ఇళ్లను కూల్చేసి స్లాబ్ ఇళ్లు నిర్మించుకుంటామని వేడుకుంటున్నారు.

– తిరుపతయ్య, పంచాయతీ కార్యదర్శి, యాచారం

### పేదలకు న్యాయం చేసేలా..



వచ్చిన దరఖాస్తులను సమగ్రంగా సర్వే చేస్తున్నాం. రెండు మూడు రోజుల్లో యాచారం మండలంలో సర్వేను పూర్తి చేసేలా కృషి చేస్తున్నాం. ఈ సర్వేతో అర్హులైన పేదలకు న్యాయం జరుగుతుంది. స్థలాలు లేని వారి వివరాలను కూడా నమోదు చేసుకుంటున్నాం. పూర్తిచేసిన సమగ్ర నివేదికలను ఉన్నతాధికారులకు పంపిస్తాం. అంతా ఆన్‌లైన్లో వివరాలను నమోదు చేస్తున్నాం.

– నరేందర్‌రెడ్డి, ఎంపీడీఓ యాచారం

## ఆరు గ్యారంటీలు అమలు చేస్తాం



మాట్లాడుతున్న జయమ్మ, విష్ణువర్ధన్‌రెడ్డి

**మంచాల:** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను కచ్చితంగా అమలు చేసి తీరుతామని రాష్ట్ర నాయకుడు కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ మహిళ అధ్యక్షురాలు గుండమోని జయమ్మ పేర్కొన్నారు. శనివారం మంచాల మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేస్తామన్నారు. మహిళలకు ఉచిత బస్సు, సబ్సిడీపై వంట గ్యాస్, రుణమాఫీ, ఉచిత కరెంట్, ఆరోగ్య శ్రీ పథకం, ఇందిరమ్మ ఇళ్ల పథకాలను కూడా అమలు చేస్తామన్నారు. పదేళ్ల కాలంలో బీఆర్‌ఎస్ ధనిక రాష్ట్రాన్ని దివాళా రాష్ట్రంగా మార్చిందని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో అవినీతికి తావులేదని, ఎవరైనా అవినీతి అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం మంచాల మండల పార్టీ ఆధ్వర్యంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు సాతిరి ఎల్లేశ్, కొర్ర పాండులను శాలువా కప్పి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వింజమూరి రాంరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు సాతిరి ఎల్లేశ్, కొర్ర పాండు, నాయకులు మల్లేశ్, రమాకాంత్‌రెడ్డి, జంగయ్య, రాజు, బాలయ్య, వీరేశ్‌గౌడ్, సురేశ్, శ్రీధర్, శ్రీనునాయక్, కిషన్ నాయక్, జనార్దన్, గుడ్డి మల్ల చంద్రయ్య, బుగ్గరాములు, మాజీ ఎంపీటీసీ సభ్యులు నరేందర్‌రెడ్డి, జయనందం తదితరులు పాల్గొన్నారు.

## అమిత్‌షా వ్యాఖ్యలపై నిరసనలు



ఇబ్రహీంపట్నం: అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న డీఎస్పీ నేతలు

**ఇబ్రహీంపట్నం:** డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్‌ను అవమాన పరిచేవిధంగా పార్లమెంట్‌లో అమిత్ షా చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ ధర్మసమాజ్ పార్టీ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జిలు ధరించి శనివారం అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భవానీ శేఖర్, శేఖర్, ప్రవీణ్, ప్రదీప్, చక్రపాణి, లింగం, రమేష్, లింగస్వామి, వినోద్‌కుమార్‌లు పాల్గొన్నారు.

**ఆమనగల్లులో..**

**ఆమనగల్లు:** అమిత్‌షా చేసిన వ్యాఖ్యలకు దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు ఒగ్గు మహేశ్ డిమాండ్ చేశారు. ఆమనగల్లు పట్టణంలో అంబేడ్కర్ యువజన సంఘం నిరసన ర్యాలీ నిర్వహించారు. జంతుక శంకర్, బీమయ్య, మైసయ్య, సాయిలు, అఫిజ్, రమేశ్, సుందర్ తదితరులు పాల్గొన్నారు.

**తలకొండపల్లిలో..**

**తలకొండపల్లి:** మండల కేంద్రంలో దళిత, ప్రజా సంఘాల నాయకులు నిరసన చేపట్టారు. తలకొండపల్లి మండల కేంద్రంలో ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా అమిత్‌షా దిష్టిబొమ్మను దగ్దం చేశారు. అంబేడ్కర్ పూలే జాతర వ్యవస్థాపకుడు సుధాకర్, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నయ్య పాల్గొన్నారు.

### ప్రతీ ఒక్కరికి గణితం ముఖ్యం

ఆమనగల్లు, ఇబ్రహీంపట్నం మండలాల్లోని ఆయా ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలో శనివారం జాతీయ గణిత దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రాజకీయనాయకులు, ఉపాధ్యాయులు శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడారు. ప్రతీ ఒక్కరి జీవితంలో గణితం చాల ముఖ్యమని, గణితం లేక పోతే వ్యవస్థ ముందుకు సాగదన్నారు. విద్యార్థి దశలోనే గణితంపై పట్టు సాధించాలని సూచించారు.



ఇబ్రహీంపట్నం: బాలికల జెడ్పీహెచ్‌ఎస్‌లో గణితం అంశాలతో రంగోళిలో విద్యార్థినులు



కడ్తాల్: నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



ఇబ్రహీంపట్నం: డిగ్రీ కళాశాలలో క్విజ్ పోటీలో విజేతలతో అధ్యాపకులు

### విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరం

**అబ్దుల్లాపూర్‌మెట్:** రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు ఆదేశాల మేరకు అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాటసింగారంలోని మహాత్మాజ్యోతిరావు పూలే బీసీ వెల్ఫేర్ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలో శనివారం అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు, ఎల్‌బీనగర్ కామినేని ఆసుపత్రి సహకారంతో మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పాఠశాలలోని 459 విద్యార్థులకు వైద్య పరీక్షలతో పాటు అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి, అబ్దుల్లాపూర్‌మెట్ సీఐ అంజిరెడ్డి, ఎస్‌ఐలు కరుణాకర్‌రెడ్డి, బద్యానాయక్ పాల్గొన్నారు.

### టీఎస్‌యూటీఫ్ మహాసభల వాల్ పోస్టర్ ఆవిష్కరణ

**ఇబ్రహీంపట్నం:** టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్‌ను ఆ సంఘం నేతలు శనివారం ఇబ్రహీంపట్నంలో ఆవిష్కరించారు. ఈ నెల 28, 29, 30 తేదీల్లో నల్లగొండలో నిర్వహించనున్న ఈ మహాసభలకు ప్రొఫెసర్ నాగేశ్వర్‌రావు, టీచర్స్ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి హాజరవుతున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం, యాచారం, మంచాల మండలాల సంఘం నేతలు పాల్గొన్నారు.

### క్రీడలతో శారీరక మానసికోల్లాసం

ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి



జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి

**అబ్దుల్లాపూర్‌మెట్:** క్రీడలతో శారీరక మానసికోల్లాసం కలుగుతుందని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘం లక్ష్మారెడ్డిపాలెంలోని డిస్కవరీ ఓక్స్ పాఠశాలలో ఖేలోత్సవ్ 2.0 వార్షిక క్రీడోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. అనంతరం హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ మాజీ ఉపాధ్యక్షుడు కె. జాన్ మనోజ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామని పాఠశాల డైరెక్టర్ తీగల నీలిమ, ప్రధానోపాధ్యాయురాలు సారాఅంజుమ్‌లు పేర్కొన్నారు.

## బీజేపీ అధికారంలోకొచ్చాకే మతకలహాలు

సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు యాదయ్య, సామేలు




సీపీఎం మహాసభ ప్రదర్శనలో యాదయ్య, సామేలు తదితరులు

**అబ్దుల్లాపూర్‌మెట్:** దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చాకే ప్రతీ రాష్ట్రంలో మతకలహాలు పెరుగుతున్నాయని సీపీఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు యాదయ్య, సామేలు పేర్కొన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన సీపీఎం 3వ మండల మహాసభల సందర్భంగా మండల కేంద్రంలో విజయవాడ జాతీయ రహదారిపై భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం శివ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో నిత్యం ప్రజాసమస్యలపై పోరాడుతూ, ప్రభుత్వ రంగాల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలంటూ, కార్మికుల పక్షాన పోరాటం చేసేది సీపీఎం మాత్రమేనన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి జగదీష్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ప్రకాష్ కారత్, జిల్లా కమిటీ సభ్యులు డి కిషన్, గుండె శివ, మండల నాయకులు ముత్యాలు, సరిత, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

**మండల కార్యదర్శిగా ఏర్పుల నర్సింహ నియామకం**

సీపీఎం మండల కార్యదర్శిగా ఏర్పుల నర్సింహను మూడో సారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కమిటీ సభ్యులుగా గుండె శివ, పరకాల ముత్యాలు, ఆలేటి ఆటం, పరంద శ్రీను, బి సరిత, ఇరుగు భిక్షపతి, చిర్ర శివ, మేడిపల్లి శ్రీశైలం సభలో ఎన్నుకున్నట్లు వారు ప్రకటించారు.



ఫుడ్ ఫెస్టివల్‌లో మాట్లాడుతున్న హెచ్‌ఎం సత్తు పాండురంగారెడ్డి

### నోరూరించే వంటకాలు

కుర్మిద్ద పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్



కుర్మిద్ద ఉన్నత పాఠశాలలో ఇంటి నుంచి తెచ్చిన వంటకాలతో విద్యార్థినులు

**యాచారం:** మండల పరిధిలోని కుర్మిద్ద ఉన్నత పాఠశాలలో శనివారం ఫుడ్ ఫెస్టివల్ దినోత్సవం నిర్వహించారు. ఆహార అలవాట్లు, పోషకాలు ఉండే ఆహారం, సాంప్రదాయ వంటకాలు, చిరుధాన్యాలు, జొన్నరొట్టెలు, రాగి సంకటిలో ఉండే పోషకాలపై పాఠశాల హెచ్‌ఎం సత్తు పాండురంగారెడ్డి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల స్వప్న, శ్రీనువాస్, అశోక్, వీరమణి, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

## పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



పౌష్టికాహారం గురించి వివరిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు సునీతారెడ్డి

**ఇబ్రహీంపట్నం:** పౌష్టికాహారంతోనే ఆరోగ్యంగా ఉండొచ్చని పలువురు ఉపాధ్యాయులు పేర్కొన్నారు. శనివారం ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఫుడ్‌ఫెస్టివల్ నిర్వహించారు. విద్యార్థులే స్వయంగా తయారు చేసిన వివిధ రకాల వంటకాలను ప్రదర్శనలో ఉంచారు. సుమారు 72 రకాల ఆహార పదార్థాలను తీసుకొచ్చి విక్రయించారు. బలమైన ఆహారం తీసుకుంటే రోగనిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకట్‌రెడ్డి, గణిత ఉపాధ్యాయులు సురేశ్ పాల్గొన్నారు.

**ఆమనగల్లులో..**

**ఆమనగల్లు:** ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని నుచ్చుగుట్టతాండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో తెలంగాణ ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమంలో భాగంగా మనబడిలో ఆహారోత్సవం పేరుతో విద్యార్థులకు పౌష్టికాహారంపై అవగాహన కలిగించారు.

## పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి కృషి

డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి



పారిశుద్ధ్య కార్మికులకు ఇన్సూరెన్స్ కార్డులు అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

**కడ్తాల్:** గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తానని, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం కడ్తాల్ గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులతో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్న కృషిని ఆయన ప్రశంసించారు. పారిశుద్ధ్య కార్మికులు చేసే వృత్తిలో ఆరోగ్యపరమైన, ప్రమాదవశాత్తు ఏదైన అనుకోని సంఘటనలు జరిగితే వారికి రక్షణగా ఉండేందుకు తన స్వంత ఖర్చులతో ఆయన ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించామన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్రామ పంచాయతీకి చెందిన 28 మంది కార్మికులకు ఆయన పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు అశోక్, మాజీ కో ఆప్షన్ సభ్యులు జహంగీర్‌బాబా, మాజీ వార్డు సభ్యులు మల్లయ్య, శ్రీను, బుచ్చయ్య, శ్రీశైలం, కుమార్, గ్రామ పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

## సీఎం సహాయనిధి పేదలకు వరం

జిల్లా ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి



చెక్కు అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి

**కడ్తాల్:** సీఎం సహాయనిధి పేదలకు వరమని జిల్లా ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రానికి చెందిన అనసూయ అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓ ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకొని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో మంజూరైన సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు రూ.65 వేలు శనివారం అందజేవారు. ఈ కార్యక్రమంలో మాజీ కో ఆప్షన్ సభ్యులు జహంగీర్‌బాబా, శ్రీను, అశోక్, రాజేశ్, జహంగీర్‌అలీ, సత్యం, షాబుద్దీన్, ఇమ్రాన్, బోసురవి, కిరణ్, శ్రీకాంత్, బాలరాజు, అంజి, మహేశ్, శ్రీశైలం, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### ధ్యానంతో ఆరోగ్యం

**ఆమనగల్లు:** పట్టణంలోని ఆమనగల్లు గ్రామర్ హైస్కూల్లో శనివారం ప్రపంచ ధ్యాన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు ధ్యానం చేశారు. అనంతరం ఉపాధ్యాయులు మాట్లాడారు. ధ్యాన సాధనతో మానసికోల్లాసం, మనస్సుకు ప్రశాంతత చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకుడు ప్రదీప్‌కుమార్, శివలింగం, సంజీవ్ కుమార్, కోట్ల వెంకటేశ్, ఉపాధ్యాయులు సుమతి, నస్రీన్, ఆసియా, జయలక్ష్మి, నిఖిత, మౌనిక, జ్యోతి, అనూష, సునీత, సరస్వతి, బాలీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.